

హుస్నాబాద్ సర్కారు దవాఖానలో రెండు రోజుల క్రితం జన్మించిన శిశువును చూస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి

- మెడికల్ కళాశాల కోసం స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించాం
- నిరుపేదలు ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సాయానికి కసరత్తు
- హుస్నాబాద్ పట్టణం, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్ మున్సిపల్‌లో పౌరసన్మానం, సర్కారు దవాఖాన సందర్శన

హుస్నాబాద్, డిసెంబర్ 12: కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి హుస్నాబాద్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. హుస్నాబాద్ మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్‌తో పాటు పాలకవర్గం మంత్రికి ఘనస్వాగతం పలికారు. కౌన్సిలర్లు, రెవెన్యూ అధికారులు, ప్రముఖులు మంత్రిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణానికి చుట్టూ 40కిలోమీటర్ల వరకు పెద్ద పట్టణం లేదని, హుస్నాబాద్ పట్టణాన్ని నగరంగా తయారు చేసి ఈ ప్రాంత ప్రజలు గర్వంగా చెప్పుకునే విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. హుస్నాబాద్‌కు మెడికల్ కాలేజీ మంజూరు ఖాయమని, ఇందుకోసం స్థల పరిశీలన చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించామని తెలిపారు. హుస్నాబాద్‌కు మెడికల్ కళాశాల గొప్ప అచీవ్‌మెంట్‌గా మారుతుందన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, అనంతరం అభివృద్ధి ఎజెండాగా పనిచేయాలని సూచించారు. పట్టణ అభివృద్ధికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని మున్సిపల్ అధికారులు, పాలకవర్గానికి సూచించారు. ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా మార్చడం, ఆరోగ్యం, వైద్యం అందుబాటులోకి తేవడం, ప్రధాన రహదారులకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం, పట్టణానికి రింగ్‌రోడ్డు ప్రతిపాదనలు సిద్ధం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. నియోజకవర్గంలోని నిరుపేదలందరూ ఇండ్లు కట్టుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని తెలిపారు. గౌరవెల్లి ముంపు బాధితుల సమస్యలు పరిష్కరిస్తానని, హుస్నాబాద్ పట్టణాన్ని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఐదేండ్లపాటు సేవలందిస్తానన్నారు.

## సామాజిక ఆరోగ్యకేంద్రం సందర్శన

హుస్నాబాద్‌లోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. అక్కడ వాసవి సేవా సమితి వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దవాఖాన లోపలికి వెళ్లి రోగులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరాతీశారు. దవాఖానకు కావాల్సిన సదుపాయాలపై సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌రెడ్డితో చర్చించారు. త్వరలోనే సకల సౌకర్యాలు గల దవాఖానగా రూపుదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు బోజు రమారవి, వాల సుప్రజానవీన్, బొల్లి కల్పనాశ్రీను, జనగామ రత్నరవీందర్ రావు, చిత్తారి పద్మ, సరోజన, గూల్ల రాజు, గోవిందు రవి, పెరుక భాగ్యారెడ్డి, బొజ్జ హరీశ్, వల్లపు రాజు, దొడ్డి శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, పున్న లావణ్యసది, కో-ఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్, లలిత, శ్రీలత, ఆర్ఐ కృష్ణ, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, నాయకులు చిత్తారి రవీందర్, ఆకుల వెంకట్, ఎండీ హసన్, దవాఖాన వైద్యులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ మున్సిపల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు

# కేసీఆర్‌కు హ్యాట్రిక్

## గజ్వేల్ గడ్డ.. గులాబీ అడ్డా

- బీఆర్‌ఎస్‌కే మూడోసారి జైకొట్టిన ప్రజలు
- అభివృద్ధికి పట్టం కట్టిన జనం
- గులాబీ అధినేత కేసీఆర్ వైపే ప్రజల మొగ్గు

గజ్వేల్, డిసెంబర్ 12 : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో వెన్నంటి నడిసిన గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు రాష్ట్రం సాధించుకున్న తర్వాత కూడా ఉద్యమపార్టీతోనే ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అన్ని వర్గాలు రాష్ట్రసాధనలో కీలకంగా పాలుపంచుకున్నారు. రాజకీయ పార్టీలను చైతన్యం చేయడంలో గజ్వేల్ గడ్డ ఎంతో ముందుంటుంది. రాష్ట్ర సాధన తర్వాత కేసీఆర్ గజ్వేల్ ప్రాంతంలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడంతో ప్రజలు మరింత దగ్గరయ్యారు.రాష్ట్ర సాధన తర్వాత కేసీఆర్ ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రం నుంచి 2014లో మొదటి సారి ఎన్నికల్లో పాల్గొనేందుకు కార్యాచరణ రూపొందించారు. గజ్వేల్ ప్రాంతం అన్నింట్లో ముందు వరుసలోనే ఉంది. 2014, 2018లో రెండు సార్లు ముఖ్యమంత్రిని అందించిన ఘనత గజ్వేల్ ప్రజలకు దక్కుతుంది. వరుసగా మూడుసార్లు గజ్వేల్ నుంచి గెలుపొంది కేసీఆర్ హ్యాట్రిక్ సాధించారు.



గజ్వేల్‌లో మాతాశిశు దవాఖాన





కోమటిబండలో మిషన్ భగీరథ ప్లాంట్

### అక్కున చేర్చుకున్న గజ్వేల్ ప్రజలు..

భారత్ రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకొంది. మొదటి సారి జరిగిన ఎన్నికల్లో అన్ని మండలాల నుంచి అభ్యర్థులు స్థానిక సంస్థలకు పోటీ చేయగా కొన్ని స్థానాలను కైవసం చేసుకున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత జరిగిన సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరపున కేసీఆర్ పోటీ చేయడంతో ప్రజలు ఆదరించి గెలిపించుకున్నారు. 2014, 2018లో రెండు సార్లు ముఖ్యమంత్రిని అందించిన ఘనత గజ్వేల్‌కే దక్కుతుంది. 2023లో జరిగిన ఎన్నికల్లో మూడోసారి పోటీ చేసి గెలుపొంది కేసీఆర్ హ్యాట్రిక్ సాధించారు. 2014 ఎన్నికల్లో 19, 391 ఓట్ల మెజార్టీతో, 2018లో 58,290ఓట్ల మెజార్టీతో, 2023లో 45,031ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వరుసగా మూడుసార్లు గెలుపొంది గజ్వేల్‌లో కేసీఆర్ హ్యాట్రిక్ సాధించారు. గజ్వేల్ నియోజకవర్గంలో 2,74,654 ఓటర్లు ఉండగా 2023లో సాధారణ ఎన్నికల్లో 2,31,086 ఓట్లు పోలవగా కేసీఆర్‌కు 1,11,684 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 66,653ఓట్లు రాగా కాంగ్రెస్ తరపున పోటీ చేసిన తూంకుంట నర్సారెడ్డికి డిపాజిట్ దక్కలేదు. స్వతంత్ర అభ్యర్థులకు సుమారు20వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. మూడు ఈవీఎంలు ఉండడంతో వృద్ధులు గుర్తులను గుర్తించడంలో ఇబ్బందులు పడి స్వతంత్ర అభ్యర్థులకు ఎక్కువగా ఓటు వేశారు. స్వతంత్ర అభ్యర్థులకు పడిన ఓట్లలో బీఆర్‌ఎస్‌కే పడేవి ఎక్కువగా ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో పోటీలో ఉండడంతో కేసీఆర్‌కు ఈ సారి మెజార్టీ తగ్గిందని చెప్పొచ్చు. ప్రారంభం నుంచి చివర వరకు ప్రతి రౌండ్‌లో కేసీఆర్‌కే మెజార్టీ దక్కింది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అత్యధిక సీట్లు వచ్చినప్పటికీ గజ్వేల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి తూకుంట నర్సారెడ్డికి డిపాజిట్ దక్కకపోవడం విశేషం.



గజ్వేల్ రింగ్‌రోడ్డు

### అభివృద్ధికే పట్టం కట్టిన ప్రజలు

తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల పునర్విభజనలో భాగంగా సిద్దిపేట జిల్లా ఆవిర్భవించింది. కొత్త జిల్లాల పునర్విభజనతో గజ్వేల్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైంది. దీంతో కొత్తగా మర్కూక్, మనోహరాబాద్ మండలాలు ఏర్పాటు కాగా ప్రజల విజ్ఞప్తి మేరకు 2022లో కుకునూర్‌పల్లిని మరో మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించింది. గతంలో గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కేసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రెండుసార్లు కొనసాగారు. తొమ్మిదిన్నరేండ్లలో అభివృద్ధిలో గజ్వేల్ రూపురేఖలు మారాయి. పేదల కోసం గజ్వేల్ పట్టణంలో1250 డబుల్ ఇండ్లు, గ్రామాల్లో సుమారు 4వేల డబుల్ ఇండ్లు నిర్మించారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాలకు కేసీఆర్ మొదటి ప్రాధాన్యత కల్పించారు. బాలుర, బాలికల కోసం వేరు వేరుగా రూ.146కోట్లతో ఎడ్యుకేషన్ హబ్ నిర్మించి సకల వసతులు కల్పించారు. గజ్వేల్ పట్టణం చుట్టూ 22కిలోమీటర్ల మేర రూ.297కోట్లతో రింగ్‌రోడ్డు నిర్మాణం, రూ.719.50కోట్లతో 354కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలతో పాటు పంచాయతీరాజ్ రోడ్లు, గజ్వేల్ మండలం కోమటిబండ వద్ద తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా రూ.400కోట్లతో మిషన్ భగీరథ ప్లాంట్,కుకునూర్‌పల్లి మండలం మంగోల్ వద్ద రూ.1212కోట్లతో మిషన్ భగీరథ తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్ నిర్మాణం జరిగింది. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో ఒకే చోట అధికారుల కార్యాలయ భవనాల కోసం రూ.42.50కోట్లతో ఐవోసీ భవనం, ప్రతి మండల కేంద్రంలో మండల సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనాలు, పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో రూ.57.30కోట్లతో మాతాశిశు ,జనరల్ దవాఖాలను నిర్మించారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులను కలుపుతూ రూ.158కోట్లతో అండర్‌గ్రౌండ్‌డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. ములుగు రాజీవ్ రహదారి పక్కనే ఆచార్య కొండాలక్ష్మణ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అటవీ యూనివర్సిటీలు నిర్మించడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చింది. రూ.1762 కోట్లతో కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. గజ్వేల్‌లో రూ.22.35కోట్లతో వెజ్‌నాన్ వెజ్ మార్కెట్, రూ.2.47కోట్లతో పత్తి మార్కెట్, ప్రధానంగా ఎన్నో ఏండ్ల నుంచి ఎదురుచూసిన రైలు కలను సీఎం కేసీఆర్ నిజం చేసి చూపారు. వేలాది మందికి రైతు బంధు అందుతుంది. గ్రామాల్లో రైతు వేదికలు, వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, పంట కల్లాలు, గ్రామ పంచాయతీ, మహిళ, అంగన్‌వాడీ, పాఠశాల భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కొండపోచమ్మ ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాలను తునికి బొల్లారంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని వసతులు కల్పించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామాల కోసం గజ్వేల్ పట్టణ సమీపంలో 600ఎకరాల విస్తీర్ణంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మాణం అద్భుతంగా చేపట్టారు. కొత్త మండలాల్లో పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు.





రైల్వే స్టేషన్



గజ్వేల్ నియోజకవర్గ మ్యాప్




చర్చి ఆవరణలోని వసతి గృహం వద్ద ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక



ఆనాటి జెరూసలేం చర్చి

# క్రిస్మస్ సందడి..

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 12: క్రిస్మస్ పండుగ సమీపిస్తుండటంతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి ఆవరణ సందడిగా మారింది. సీఎస్ఐ వసతి గృహాల వద్ద ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక, బెత్లే హోం, నజరేతు పట్టణం, జెరూసలేం చర్చి నమూనాలను విద్యార్థులు ఎంతో సుందరంగా రూపొందించారు. ప్రతి సంవత్సరం క్రిస్మస్‌కు నెల రోజుల ముందే ఈ నమూనాలను సిద్ధం చేస్తారు.



నజరేతు, బెత్లేహోం పట్టణాలు

# అధినేతను చూసేందుకు..

# హైదరాబాద్ తరలిన అభిమానులు

గజ్వేల్/ గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 12: హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్‌ను చూసేందుకు మంగళవారం గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కొంతకాలం కేసీఆర్ దవాఖానలోనే విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించడంతో ఆయనను కార్యకర్తలు కలువలేకపోయారు. దవాఖాన వద్ద పెద్దసంఖ్యలో వేచి ఉన్న కార్యకర్తలను మాజీ మంత్రి కేటీఆర్ కలిసి విషయం చెప్పడంతో అందరూ వెనుతిరిగి వచ్చారు.

**కేసీఆర్ త్వరగా కోలుకోవాలి: వంటేరు ప్రతాప్‌రెడ్డి**

బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో గజ్వేల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలివచ్చారని బీఆర్‌ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. దవాఖాన వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రమాదవశాత్తు జరిగిన ఘటనతో దవాఖానలో చేరిన కేసీఆర్‌ను చూసేందుకు పార్టీ కార్యకర్తలు ఎదురు చూస్తున్నారన్నారు. గజ్వేల్ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన కేసీఆర్ త్వరగా కోలుకోవాలన్నారు. తరలివెళ్లినవారిలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి రాజమౌళి, కౌన్సిలర్లు లక్ష్మీకిషన్‌రెడ్డి, శ్యామల మల్లేశం, ఉప్పల మెట్టయ్య, గోపాల్‌రెడ్డి, రహీం, బబ్బూరి రజిత, వరలక్ష్మికనకయ్య, పంబాల అర్చన శివకుమార్, కో-ఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ ఆర్‌కే శ్రీను, నాయకులు అఖిల్, కార్యకర్తలు భారీ సంఖ్యలోతదితరులున్నారు. కాగా, శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయం వద్ద 6వ వార్డు కౌన్సిలర్ బబ్బూరి రజిత, వార్డు అధ్యక్షుడు జోడుప్రకాశ్ తదితరులు సీఎం కేసీఆర్ ఆరోగ్యం త్వరగా బాగుపడాలని పూజలు చేశారు.



దవాఖాన వద్ద మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి



యశోద దవాఖానకు తరలివెళ్లిన మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్లు, నాయకులు



శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న కౌన్సిలర్ బబ్బూరి రజిత